క్లుప్తంగా

108 వాహనం పరిశీలన

తిరుమలాయపాలెం: మండలానికి మంజూరైన నూతన 108 వాహనంలోని పరికరాల పనితీరును జిల్లా కోఆర్డినేటర్ దుర్గాప్రసాద్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో 108 సిబ్బంది కృష్ణయ్య, నానయ్య, పైలెట్లు వీరయ్య, సక్రు పాల్గొన్నారు.

కేసీఆర్‌ను కలిసిన గుండాల కృష్ణ



కేసీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కృష్ణ

ఖమ్మంమయూరిసెంటర్: బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను ఎర్రవెల్లిలో పార్టీ నాయకుడు గుండాల కృష్ణ మంగళవారం కలిశారు. ఇటీవల ప్రభుత్వం చేపట్టిన బీసీ కులగణనపై జిల్లాలో స్పందన, కాంగ్రెస్ పాలనలో ప్రజలు ఎదుర్కొంటున్న ఇక్కట్లను కృష్ణ ఆయనకు వివరించారు. బీసీల పక్షాన మొండివైఖరి వహిస్తున్న ప్రభుత్వ విధానాలపై త్వరలోనే ప్రజలకు అవగాహన కల్పిస్తామని తెలిపారు. ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను సైతం కృష్ణ కలిశారు.

గుండెపోటుతో లష్కర్ మృతి

నేలకొండపల్లి: నీటిపారుదల శాఖలో పనిచేస్తున్న మండలంలోని మంగాపురంతండాకు చెందిన లష్కర్ బానోత్ భద్రు(55) మంగళవారం గుండెపోటుతో మృతి చెందాడు. వీఆర్ఏగా పనిచేసి గత రెండేళ్ల క్రితం ఇరిగేషన్ శాఖలో లష్కర్‌గా బాధ్యతలు స్వీకరించారు. కాగా, నీటిపారుదల శాఖ అధికారులు అంత్యక్రియల నిమిత్తం రూ.7వేలను అందించారు. పలువురు నివాళులర్పించి మృతుడి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

సన్న బియ్యం అందించాలి

నేలకొండపల్లి: ప్రభుత్వ వసతి గృహాలు, గురుకుల పాఠశాలల్లో విద్యార్థులకు సన్న రకం బియ్యం సరఫరా చేయాలని పీడీఎస్‌యూ జిల్లా గోకినేపల్లి మస్తాన్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని బీసీ వసతి గృహాన్ని సంఘం నాయకులు మంగళవారం రాత్రి సందర్శించి విద్యార్థులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేసి సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. గాంధీ, రవికుమార్, భరత్, గోపి తదితరులు పాల్గొన్నారు.

బోరుకు మరమ్మతులు

ఖమ్మంరూరల్: మండలంలోని ఆరెంపులలో తాగునీటి ఎద్దడి నెలకొనడంతో ప్రజలు ఇబ్బందులు పడుతుండగా.. స్పందించిన గ్రామ మాజీ సర్పంచ్ బండి జగదీష్ తన సొంత ఖర్చులు రూ.90వేలతో మంచినీటి బోరుకు మరమ్మతులు చేయించి పైపు లైన్ నిర్మాణం చేసి పునరుద్ధరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే వేసవి కాలం దృష్ట్యా మరమ్మతులు చేయించామన్నారు.

సేవాలాల్ జయంతిని ఘనంగా నిర్వహించాలి

రఘునాథపాలెం: రఘునాథపాలెం సెంటర్‌లోని జింకల్‌తండా క్రాస్‌రోడ్డు వద్ద ఈ నెల 15న సంత్‌శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించాలని పలువురు గిరిజన నాయకులు పేర్కొన్నారు. మంగళవారం జయంతి వేడుకల సన్నాహక సమావేశంలో పలువురు మాట్లాడారు. లంబాడీ సోదరులు భోగ్ బండారో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో మాలోత్ రామునాయక్, భూక్యా రాంబాబు, కేలోతు దేవుసింగ్, భూక్యా బాలాజీ, వాంకుడోత్ దీప్లా, శివలాల్, బానోత్ కోటేశ్వరరావు, లాల్‌సింగ్, బానోత్ బాలునాయక్ తదితరులు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం

రఘునాథపాలెం: మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక అదృశ్యమైనట్లు కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదుపై మంగళవారం రఘునాథపాలెంలో కేసు నమోదైంది. సీఐ ఉస్మాన్‌షరీఫ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఇంటి నుంచి బయటకు వెళ్లిన బాలిక తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు చాలా చోట్లా ఆరా తీసినా ఆచూకీ లభించలేదు. దీంతో బాలిక కుటుంబసభ్యులు మంగళవారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.


నగరంలో సినిమాలు

తిరుమల	సంక్రాంతికి వస్తున్నాం
వినోద	తండేల్
సాయిరాం	డాకు మహారాజ్
ఆదిత్య	గేమ్ చేంజర్
శ్రీనివాస	డాకు మహారాజ్
సినీగెలాక్సీ	ఏజెంట్ గై001

- ఖమ్మంగాంధీచౌక్

మారనున్న మండల ముఖచిత్రం..

గత ప్రభుత్వ హయాంలో కొత్త జిల్లాలు, మండలాలు ఏర్పాటు సమయాన ఖమ్మం అర్బన్, ఖమ్మం రూరల్ మండలం నుంచి కొన్ని గ్రామాలను విడదీసి రఘునాథపాలెం మండలంగా ఏర్పాటు చేశారు. దానికి అనుగుణంగా అధికారులు మండల ముఖచిత్ర మ్యాప్ తయారు చేశారు. కాగా, రూరల్ నుంచి కలిసిన గ్రామాలు తిరిగి కలవనుండగా మళ్లీ మండల రూపురేఖలు మారనుంది. గత ఎన్నికల్లో మండలంలో ఉన్న పాలేరు నియోజకవర్గం పరిధిలోని కామంచికల్, దారేడు, పడమతండా పంచాయతీలతో పాటు కామంచికల్ ఎంపీటీసీ పరిధిని తిరిగి యథావిధిగా రూరల్ మండలంలో విలీనం చేశారు. దీంతో గతంలో 40 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించగా.. ఈసారి 37 పంచాయతీలకు, 14 ఎంపీటీలకుగాను 13 ఎంపీటీసీలకు ఎన్నికలు నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నారు.



రఘునాథపాలెం మండల మ్యాప్

‘స్థానిక’ పోరుకు సన్నద్ధం

శరవేగంగా ఎమ్మెల్సీ, పంచాయతీ ఎన్నికల పనులు

- పోలింగ్ స్టేషన్‌ల డ్రాఫ్ట్ పబ్లికేషన్
- మండలంలో 41,105 మంది ఓటర్లు
- 81 పోలింగ్ కేంద్రాలు, 13 ఎంపీటీసీలు, 37 గ్రామపంచాయతీలు
- గ్రామాల్లో అవగాహన సదస్సులు

రఘునాథపాలెం: స్థానిక సంస్థల పోరుకు అధికారులు గత కొద్ది రోజులుగా ఏర్పాట్లు శరవేగంగా చేస్తున్నారు. మండలంలో మొత్తం 41,105 మంది ఓటర్లు ఉండగా.. 81 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు నిర్వహించేలా చర్యలు చేపట్టారు. ఆయా ప్రాంతాలు, కేంద్రాల పరిధిలో ఉన్న గదులు, తాగునీరు, విద్యుత్ తదితర వసతులపై సమగ్ర నివేదిక సైతం తయారు చేయించి గత శనివారం పోలింగ్‌స్టేషన్‌ల డ్రాఫ్ట్ పబ్లికేషన్ కోసం ఉన్నతాధికారులకు పంపించారు. ప్రభుత్వం మండల పరిషత్ లేదా గ్రామ పంచాయతీలకు ఎప్పుడు ఎన్నికలు జరిపినా.. దానికి అనుగుణంగా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. మండలంలో 13 ఎంపీటీసీ , 37 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరగనున్నాయి.

అవగాహన సదస్సులు

ఎమ్మెల్సీ, గ్రామపంచాయతీ ఎన్నికల దృష్టిలో పెట్టుకుని ఎంపీడీఓ అశోక్‌కుమార్ పర్యవేక్షణలో ఎన్నికల ఏర్పాట్ల పనులు చేపడుతున్నారు. ఈనేపథ్యాన మండలంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకుండా వివాదాస్పద గ్రామాలపై జాబితా తయారు చేయించారు. సీఐ ఉస్మాన్ షరీఫ్ ఆధ్వర్యాన ఆయా గ్రామాల్లో ముందస్తుగానే శాంతి సదస్సులు ఏర్పాటు చేసి ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా సహకరించాలని అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులపై ప్రత్యేక నిఘాతో పాటు ఎన్నికల ప్రవర్తనా నియమావళి తదితర విషయాలను వివరిస్తున్నారు. దీంతో స్థానిక ఎన్నికల్లో నిలబడే ఆశావహులు టికెట్లు ఎవరికి ఇస్తారోనని ఉత్సాహంగా ఎదురుచూస్తున్నారు. కొందరు ప్రముఖ నేతల వద్ద పైరవీలు నడిపించుకుని పోటీకి సైఅంటూ తమ ప్రయత్నాలకు తెరలేపడంతో గ్రామాల్లో ఎన్నికల కోలాహలం కనపడుతోంది.

ఎన్నికలకు సహకరించాలి

నేలకొండపల్లి: ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎస్సై సంతోష్ కోరారు. మండలంలోని తిరుమలాపురం, ముజ్జుగూడెం గ్రామాల్లో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు.



పాపటపల్లిలో సీఐ ఉస్మాన్‌షరీఫ్ ఆధ్వర్యాన అవగాహన సదస్సు

తూతూమంత్రంగా ‘ఉపాధి’ సామాజిక తనిఖీ



ఫోరంలో పాల్గొన్న అధికారులు, నాయకులు

రఘునాథపాలెం: మండలంలో ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించి 15వ విడత సామాజిక తనిఖీల్లో భాగంగా మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎన్నికల కోడ్ నిబంధన పేరుతో నిర్వహించిన ఇన్నర్ ఫోరమ్ తూతూమంత్రంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 40 గ్రామ పంచాయతీల్లో గుర్తించిన సుమారు రూ.11 కోట్ల పనులకు సంబంధించిన నివేదికలను సామాజిక తనిఖీ బృందం చదివి వినిపించింది. ఈనేపథ్యాన ఉపాధి హామీ సిబ్బంది నుంచి రూ.45,967లు, పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ విభాగం నుంచి రూ.42,560 రికవరీ చేయాలని ఫోరంలో గుర్తించారు. మరికొన్ని పనులకు సంబంధించి విజిలెన్స్ విభాగం విచారణ తర్వాత తగు చర్యలు ఉంటాయని వివరించారు. ఈ సభలో అడిషనల్ పీడీ చుంచు శ్రీనివాసరావు, జిల్లా ఉపాధి హామీ విజిలెన్స్ అధికారి సత్రీయా, ఏపీడీలు వెంకటరాజు, శ్రీదేవి, సోషల్ ఆడిట్ సెక్షన్ అధికారులు శాస్త్రీ, పవన్, ఎంపీడీఓ అశోక్‌కుమార్, ఉపాధి హామీ పథకం ఏపీఓ పద్మయ్యనాయుడు, ఈసీ దీపక్, ఎంపీఓ, టీఏలు, ఎస్ఆర్‌పీలు, కార్యదర్శులు, ఈజీఎస్ ఫీల్డ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. కాగా, ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ఎంపీడీఓ కార్యాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి ఫొటో ఉండడాన్ని కొంతమంది ప్రశ్నించడంతో తర్వాత అధికారులు దాన్ని తొలిగించారు.

‘జూనియర్ రెడ్ క్రాస్’ను బలోపేతం చేయాలి

ఖమ్మం మామిళ్లగూడెం: జూనియర్ రెడ్‌క్రాస్ యూత్‌ను ఖమ్మం జిల్లాలో బలోపేతం చేయాలని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ వెలిగేటి చంద్రమోహన్ పిలుపునిచ్చారు. మంగళవారం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఖమ్మం జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 14 ఏళ్ల నుంచి 30 ఏళ్ల లోపు విద్యార్థులు సొసైటీలో సభ్యత్వాలు తీసుకోవాలని, అందుకు యాజమాన్యాలు సహకారించాలని విజ్ఞప్తి చేశారు. సభ్యత్వాలు తీసుకున్న వారి నుంచి పలు సామాజిక కార్యక్రమాలు చేపట్టాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో స్టేట్ మేనేజింగ్ కమిటీ సభ్యులు సాధినేని జనార్దన్‌రావు, సెక్రటరీ జి.సూర్యప్రకాష్‌రావు, జేఆర్‌సీ, వైఆర్‌సీ కోఆర్డినేటర్లు ఎస్‌కె.ముజీబ్, జి.నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సొసైటీ చైర్మన్ చంద్రమోహన్

విద్యుత్ శాఖ డైరీ, క్యాలెండర్ల ఆవిష్కరణ



క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న అధికారులు

ఖమ్మంవ్యవసాయం: విద్యుత్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం డైరీ, క్యాలెండర్లను మంగళవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం సర్కిల్ ఎన్పీడీసీఎల్ ఎస్ఈ ఎ.సురేందర్, ఎస్ఏఓ శ్రీధర్, టెక్నికల్ డీఈ బాబూరావు, డీఈలు హీరాలాల్, సీహెచ్.నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు, యూనియన్ నాయకులు కిరణ్ చక్రవరి, ఎం.ప్రసాద్‌లు పాల్గొన్నారు. కె.రామారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సంఘం కార్యదర్శి బి.రామకృష్ణ, కోశాధికారి శ్రీధర్, వర్కింగ్ ప్రెసిడెంట్ దేవహంస, రామారావు, అసిస్టెంట్ ఇంజనీర్లు, సబ్ ఇంజనీర్లు, అకౌంట్ ఆఫీసర్లు, ఫోర్‌మెన్లు, లైన్ ఇన్‌స్పెక్టర్లు, ఆర్టిజన్లు, అన్‌మేన్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

పీఎఫ్ కార్యాలయం ఎదుట నిరసన



నిరసన తెలుపుతున్న అసోసియేషన్ నాయకులు, పెన్షనర్లు

ఖమ్మం మామిళ్లగూడెం: పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన పీఎఫ్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గోపీచంద్ మాట్లాడుతూ.. ఈపీఎఫ్ పెన్షనర్ల సమస్యలపై కేంద్రానికి విజ్ఞప్తులు చేస్తున్న పట్టించుకోవడంలేదని, పెన్షన్ మంజూరి విషయంలో సంస్కరణలు చేయకపోవడం వలన చాలామంది పెన్షనర్లు కేవలం రూ.1,000 మాత్రమే పెన్షన్ తీసుకుంటూ ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గౌరవ అధ్యక్షుడు వాసిరెడ్డి మల్లికార్జున్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి టీఎస్. రావు, ఉపాధ్యక్షులు నెల్లూరి వీరబాబు, మాధవరావు, ఏటుకూరి రామారావు, భాస్కర్‌రెడ్డి, వి.భాస్కర్‌రావు, ఝాన్సీ, రవికుమార్, వెంకట్రామారావు, గణపతి, నాగేశ్వరావు, వెంకటేశ్వర్లు, కుటుంబరావు తదితరులు పాల్గొన్నారు.

మేయర్‌కు వినతి



మేయర్‌కు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

ఖమ్మం మామిళ్లగూడెం: రాబోయే రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని మసీదులు, ఖబ్రస్థాన్‌లను శుభ్రం చేయించాలని, అక్కడి పరిసరాల్లో వీధిలైట్లు వేయించడం, బ్లీచింగ్ పౌడర్ చల్లించడం వంటి పారిశుద్ధ్య పనులు చేయించాలని ఖమ్మం నగర మైనార్టీ కాంగ్రెస్ అధ్యక్షుడు అబ్బాస్‌బేగ్ ఆధ్వర్యాన మేయర్ పునుకొల్లు నీరజకు వినతి పత్రం అందజేశారు. ప్రతీ రోజు తెల్లవారుజాము నుంచి రాత్రి 12 గంటల వరకు జరిగే ప్రార్థనల్లో పిల్లలు, పెద్దలు, ముస్లిం సమాజమంతా పాల్గొనున్నందున తమకు సహకరించి అన్ని విధాల ఆదుకోవాలని కోరారు. వినతి అందించిన వారిలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు సయ్యద్ ఫరీద్ ఖాద్రి, సయ్యద్ మహమూద్, మహమ్మద్ వసీం, రియాజ్, అబ్దుల్, అబ్దుల్లా, గౌస్ పాషా తదితరులు పాల్గొన్నారు.

నగరంలో పారిశుద్ధ్య పనులు



డ్రెయినేజీలను శుభ్రం చేస్తున్న కార్మికులు

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని 34వ, 47వ, 14వ, 26వ, 8వ, 49వ డివిజన్లలో మంగళవారం పారిశుద్ధ్య పనులు నిర్వహించారు. 120 మందితో గ్యాంగ్‌వర్క్ చేపట్టి డ్రెయినేజీలను శుభ్రం చేయించి రోడ్లు ఊడిపించారు. రోడ్ల వెంట, ఖాళీ స్థలాల్లో ఉన్న వ్యర్థాల కుప్పలు ట్రాక్టర్ల ద్వారా డంపింగ్‌యార్డ్‌కు తరలించారు. ఖాళీ స్థలాల్లో వ్యర్థాలు వేస్తే చర్యలు తీసుకుంటామని స్థానికులకు తెలిపారు. శానిటరీ సూపర్‌వైజర్ సాంబయ్య పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించారు.

ఫిజికల్ సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ



సాయికిరణ్



నరేష్

తిరుమలాయపాలెం: ఫోరం ఆఫ్ ఫిజికల్ సైన్స్ టీచర్స్ ఆధ్వర్యాన ఖమ్మంలో నిర్వహించిన జిల్లా స్థాయి టాలెంట్ టెస్ట్‌లో మండల విద్యార్థులు ప్రతిభ చాటారు. తిరుమలాయపాలెం ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న సాయికిరణ్ ఇంగ్లిష్ మీడియం కేటగిరీలో తృతీయ స్థానం, తెట్టెలపాడు ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థి నరేష్ తెలుగు మీడియం కేటగిరీలో ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. వీరిద్దరు రాష్ట్ర స్థాయికి ఎంపిక కాగా, ఎంఈఓ శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయులు విజయకుమారి, ఉపాధ్యాయులు ఏ.వీ. నాగేశ్వరరావు, బాలచంద్ర ప్రసాద్, ప్రవంతి, ఉమాదేవి తదితరులు మంగళవారం అభినందించారు.

వాడిన నూనె రీసైక్లింగ్‌తో బయో డీజిల్



మాట్లాడుతున్న ఫుడ్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్

ఖమ్మంఅర్బన్: ప్రజారోగ్యంపై ప్రతి ఒక్కరూ దృష్టి సారించాలని ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ఆర్.కిరణ్‌కుమార్ సూచించారు. ఖమ్మంలో మంగళవారం ఈకో నోవా ఎనర్జీ ఆధ్వర్యాన నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. వంట నూనెను బయో డీజిల్‌గా మార్చే అవకాశమున్నందున రెస్టారెంట్ల నిర్వాహకులు, రోడ్ల వెంట వ్యాపారాలు చేసే వారు ముందుకు రావాలన్నారు. వాడిన నూనెను పారబోస్తే ఫలితం ఉండదని, అలాగని మరోమారు వాడితే ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడినట్లవుతుందని చెప్పారు. ఈనేపథ్యాన బయో డీజిల్‌గా మార్చే విషయంలో ముందుకు రావాలని సూచించారు. ఈసమావేశంలో ఈకో నోవా ఎనర్జీ నిర్వాహకుడు కొండా సాయినాథ్, సేఫ్టీ అధికారి శరత్‌కుమార్‌తో పాటు పోలా శ్రీనివాసరావు, రామారావు, నరసింహారావు, దీక్షిత్, రవితేజ, వర్మ, వివేక్, ప్రీతం, మధు తదితరులు పాల్గొన్నారు.

‘చలో హైదరాబాద్’ విజయవంతానికి ప్రచారం

తిరుమలాయపాలెం: కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతూ ఈ నెల 20న నిర్వహించే చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ మండల కార్యదర్శి గొర్రెపాటి రమేష్ పిలుపునిచ్చారు. మండలంలోని తిప్పారెడ్డిగూడెంలో మంగళవారం విస్తృత ప్రచారం నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 14 నెలలు అవుతున్నా.. సర్వేల పేరుతో ప్రజలను మభ్యపెడుతుందని విమర్శించారు. తక్షణమే పేదలందరికీ పక్కా ఇళ్లు, రేషన్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు అచ్చా ఉప్పలయ్య, పేరం వెంకటేశ్వర్లు, పోలేపొంగు నాగయ్య, ఐలయ్య, వెంకన్న, వీరన్న, రంగయ్య, రాములు, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

అర్చకుడిపై దాడి సరికాదు

రఘునాథపాలెం: చిలుకూరు దేవస్థానం ప్రధాన అర్చకుడు రంగరాజన్‌పై దాడి చేయడం సరికాదని శ్రీవైష్ణవ ఆగమ సంప్రదాయ సేవా సమితి (శ్వాస్) ఖమ్మం జిల్లా అధ్యక్షుడు ముడుంబై రవి కిరాణాచార్యులు, చిమ్మపూడి నరసింహస్వామి దేవాలయ అర్చకుడు ముడుంబ మురళీకృష్ణమాచార్యులు ఒక ప్రకటనలో ఖండించారు. రంగరాజన్ తన ప్రవచనాలతో ఎంతో మంది భక్తులను చైతన్యపరుస్తూ సన్మార్గంలో నడిపిస్తున్నారని, సనాతన ధర్మాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి భక్తుడిపై ఉందన్నారు.

వాకర్స్ క్లబ్ డిప్యూటీ గవర్నర్‌కు సన్మానం

ఖమ్మంమయూరిసెంటర్: వాకర్స్ ఇంటర్నేషనల్ జిల్లా 303 డిప్యూటీ గవర్నర్‌గా నియమితులైన రిటైర్డ్ లెక్చరర్ డాక్టర్ దేవరశెట్టి పూర్ణచందర్‌ను మంగళవారం లకారం వాకర్స్ క్లబ్ ఆధ్వర్యాన సత్కరించారు. లకారం ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన్ను సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు పుల్లయ్య, కార్యదర్శి కొత్తా శ్రీనివాసరావు, కోశాధికారి కె.వెంకటేశ్వర్లు, వాకర్స్ పెద్దలు ఎస్‌కె.ఖాదర్ బాబా, గుడిపుడి జనార్దన్‌రావు, ఎస్‌కె.బాబా, బండారు శ్రీను, నాగేశ్వరరావు, అక్కినేని రామకోటేశ్వరరావు, ఎస్‌కె.సైదులు జ్ఞానేశ్వరి, పాలవెల్లి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులు ఆర్థికంగా ఎదగాలి



మాట్లాడుతున్న సంస్థ ప్రతినిధులు

తిరుమలాయపాలెం: దివ్యాంగులు ఆర్థికంగా బలోపేతం అయినప్పుడే నిజమైన అభివృద్ధి అని ఎనేబుల్ ఇండియా తెలంగాణ స్టేట్ మేనేజర్ మల్లికార్జున్ అన్నారు. మంగళవారం మండలంలోని పిండిప్రోలులో గల సీపీఐ మార్క్సిస్ట్ పార్టీ కార్యాలయంలో ఎనేబుల్ ఇండియా సంస్థ ఆధ్వర్యాన దివ్యాంగులకు వ్యాపార నైపుణ్య శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లు అందించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. దేశవ్యాప్తంగా దివ్యాంగులకు నిర్వహించిన ఈ శిక్షణలో నేలకొండపల్లి మండలంలో 35 మంది దివ్యాంగులకు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు రాంబాబు, చంద్రశేఖర్, చందు ప్రజాపంథా నాయకులు కమ్మకోమటి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

‘రెజొనెన్స్’ విద్యార్థుల ప్రతిభ

ఖమ్మం సహకారనగర్: శ్రీనివాస రామానుజం ఫౌండేషన్(ఎస్ఆర్ఎఫ్) నిర్వహించిన ఒలంపియాడ్ కాంపిటేషన్‌లో తమ విద్యార్థులు జిల్లా, రాష్ట్రస్థాయిల్లో ప్రతిభ కనబర్చి బహుమతులు సాధించారని రెజొనెన్స్ శ్రీనివాసనగర్ విద్యాసంస్థల చైర్మన్ నాగేంద్రకుమార్, డైరెక్టర్ నీలిమలు తెలిపారు. మంగళవారం విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

జేసీబీ స్వాధీనం

నేలకొండపల్లి: వాహనాల్లో ఇసుక తోడేందుకు సిద్ధంగా ఉన్న జేసీబీని పోలీసులు మంగళవారం సీజ్ చేశారు. నేలకొండపల్లి మండలం రామచంద్రాపురంలోని ఏటి సమీపాన జేసీబీ ఉందనే విషయం తెలిసిన పోలీసులు వెళ్లి స్వాధీనం చేసుకున్నారు.

నివాళి

కూసుమంచి: కూసుమంచికి చెందిన అర్చకుడు దేవులపల్లి శివరామయ్య ఇటీవల మృతిచెందగా మంగళవారం రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ తదితరులు మృతుడికి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

జైలులో బీఆర్ఎస్ నేతను కలిసిన ఎమ్మెల్సీ

ఖమ్మంరూరల్: ఇల్లెందుకు చెందిన బీఆర్ఎస్ నాయకుడు లక్కినేని సురేందర్ రిమాండ్‌పై ఖమ్మం జిల్లా జైలులో ఉండగా ఆయనను మంగళవారం ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ కలిశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ నాయకులపై అక్రమ కేసులు బనాయిస్తోందని ఆరోపించారు. వీటికి బెదిరేది లేదని, పార్టీ నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటామని తెలిపారు.

నైతిక విలువలు బోధించాలి

ఖమ్మం సహకారనగర్: విద్యార్థులకు విద్యతో పాటు నైతిక విలువలు బోధించాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కె.రవిబాబు పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని సాహితి జూనియర్ కళాశాల 9వ వార్షికోత్సవ వేడుకల్లో జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు కూడా ముఖ్యమన్నారు. కళాశాల చైర్మన్ నాగేశ్వరరావు, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ శ్రీనివాసరావు, డైరెక్టర్లు కొండా వెంకన్న, తిరుపతయ్య పాల్గొన్నారు.

పండిట్ దీన్‌దయాళ్ వర్ధంతి

నేలకొండపల్లి: నేలకొండపల్లిలో పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ వర్ధంతిని బీజేపీ ఆధ్వర్యాన మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దీన్‌దయాళ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు పాగర్తి సుధాకర్, నాయకులు సయ్యద్ మోహినుద్దీన్, కొండా హర్ష, అల్లు కృష్ణారావు, కందరబోయిన గోపి, తుపాకుల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నుల పంపిణీ

నేలకొండపల్లి: మండల కేంద్రానికి చెందిన సీపీఎం పట్టణ కమిటీ కార్యదర్శి మందడపు మురళీకృష్ణ కుమార్తె సాయినర్మదా పుట్టిన రోజు సందర్భంగా మంగళవారం స్థానిక బాలవెలుగు విద్యాలయ పిల్లలకు నోట్ పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. బీఆర్ఎస్ కార్మిక విభాగం మాజీ జిల్లా అధ్యక్షుడు కాసాని నాగేశ్వరరావు, సీపీఎం నాయకులు కొత్తా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడికి అవమానం?

ఖమ్మంమయూరిసెంటర్: ఇంటి పన్ను చెల్లించేందుకు ఓ వృద్ధుడు కేఎంసీ కార్యాలయానికి రాగా.. అక్కడ సిబ్బంది పన్ను కట్టించుకోకుండా అతనిని అవమానించినట్లు తెలిసింది. వృద్ధుడు తాను తీసుకొచ్చిన డబ్బులను తీసి ఇంటి నంబర్ చెప్పి ఆస్తి పన్ను కట్టేందుకు ప్రయత్నించగా.. అతన్ని అక్కడ నుంచి పంపించినట్లు కేఎంసీలో చర్చ జరుగుతుంది. ప్రతీ ఏడాది మాదిరిగానే తాను కార్యాలయానికే వచ్చి పన్ను చెల్లిస్తుంటే బయటకు పంపిస్తున్నారని సదరు వృద్ధుడు ఆవేదన చెందుతూ బయటకు వెళ్లినట్లు పలువురు చర్చించుకున్నారు. కమిషనర్ సెలవుల్లో ఉండడంతో కార్యాలయంలో సిబ్బంది, ఉద్యోగులు తమకు ఇష్టమొచ్చినట్లు వ్యవహరిస్తున్నారని విమర్శలు చేస్తున్నారు. దీనిపై రెవెన్యూ అధికారులను వివరణ కోరగా.. విషయం తమ దృష్టికి వచ్చిందని, సిబ్బందిని పిలిచి మాట్లాడగా.. వృద్ధుడు చెప్పేది అర్థం కాలేదని సమాధానం ఇచ్చారని, వృద్ధుల పట్ల మర్యాదగా ఉంటూ పన్నులు కట్టించుకోవాలని సిబ్బందిని హెచ్చరించినట్లు తెలిపారు.

బస్ డిపో రోడ్డు వెడల్పు చేయాలి

ఖమ్మంమయూరిసెంటర్: నిత్యం రద్దీగా ఉండే బస్ డిపోరోడ్డును వెడల్పు చేయాలని సీపీఐ నాయకుడు బోడ వీరన్న డిమాండ్ చేశారు. మంగళవారం బస్‌డిపో రోడ్డులో డివైడర్ల తొలగింపును పరిశీలించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. డివైడర్లు, సెంట్రల్ లైటింగ్‌తో ఉన్న రోడ్డును వెడల్పు చేయకుండా డివైడర్లను తొలగించడమేమిటని, అవి అలాగే ఉంచి విస్తరిస్తే అభివృద్ధి కనబడేదన్నారు. వాహనాల రద్దీని దృష్టిలో ఉంచుకుని మయూరిసెంటర్ నుంచి రాపర్తినగర్ వరకు 60 అడుగులకు విస్తరించడంతో పాటు రద్దీ ప్రాంతాల్లో రోడ్లు వెడల్పు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎస్‌కె.సైదా, లాల్మీయ, శేఖర్, రమణ, ఆనంద్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.



డివైడర్ల తొలగింపును పరిశీలిస్తున్న నాయకులు